క్లుప్తంగా

ఓటు వినియోగంతో సుస్థిర సమాజం

ఆర్డీవో హేలాషారోన్



నగరం: ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీవో హేలా షారోన్ సూచించారు. మండల కేంద్రమైన నగరంలో శనివారం ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేపల్లె ఆర్డీవో హేలా షారోన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని సమర్థవంతమైన ప్రభుత్వాలను ఎన్నుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌లకు రాలేని వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే ఓటు హక్కును కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీశిల్ప, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, డీటీ మస్తాన్‌రావు పాల్గొన్నారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా



మూల్పూరు(వేమూరు): కూచిపూడి, మూల్పూరు గ్రామాల మధ్య ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. వేమూరు మండలంలోని పెరవలిపాలెం గ్రామానికి చెందిన దాసరి సుబ్బయ్యకు చెందిన ట్రాక్టర్ తెనాలి నుంచి పెరవలిపాలెం వస్తోంది. కూచిపూడి, మూల్పూరు మధ్య ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టరులో ఉన్న వ్యక్తులకు స్వల్ప గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కర్లపాలెం: గ్రామదేవత పెద్దింటమ్మ ఆలయ కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని రెడ్డి సేవా మిత్ర అధ్యక్షుడు నంగు గోవర్ధనరెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. విజయవాడ తనూజ వైద్యశాల డాక్టర్లు మహీధర్‌రెడ్డి, తనూజలు వైద్య శిబిరంలో నరాల వ్యాధులకు, చర్మ వ్యాధులకు వైద్య పరిక్షలు చేసి మందులు, సలహాలు అందజేస్తారని చెప్పారు. రెడ్డి సేవామిత్ర ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరగనున్న వైద్య శిబిరాన్ని అవసరమైన వారంతా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

దివ్యాంగ బాలలు శిక్షణను వినియోగించుకోవాలి



బాపట్ల: దివ్యాంగ బాలలు విద్యపై అవగాహన కార్యక్రమాలను వినియోగించుకోవాలని జిల్లా సమన్వయకర్త మట్ట జ్యోత్స్న సూచించారు. ఏబీఎం స్కూలులో శనివారం సమగ్రశిక్ష కార్యక్రమంలో భాగంగా దివ్యాంగులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాలైన వైకల్యాలు కలిగిన దివ్యాంగులకు ఏవిధమైన శిక్షణ అందించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ ఎం.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సేవలతో రోగులకు చేరువ కండి

తెనాలి అర్బన్: వైద్యులు నిస్వార్థంగా వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. పెన్నీ మినిస్ట్రీస్ సంస్థ నిర్వాహకులు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని వహాబ్‌రోడ్డులోని శారద సర్వీస్ సొసైటీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. శారద సర్వీస్ సొసైటీని స్థాపించి అనేక మందికి ఉచితంగా ఎన్నో రకాల వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ శారద సేవలు అభినందనీయమని అన్నారు. అనంతరం డాక్టర్ శారదను సన్మానించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



నరసాయపాలెం గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న బాపట్ల రూరల్ పోలీసులు



బొల్లాపల్లిలో కవాతు నిర్వహిస్తున్న మార్టూరు పోలీసులు



సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

- జిల్లాలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు
- నిర్భయంగా ఓటు వినియోగించుకోవాలని పిలుపు

బాపట్ల టౌన్: బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సాయపాలెం, జమ్ములపాలెం గ్రామాల్లో సీఐ వై.శ్రీహరి, ఎస్ఐ వి.రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. మార్టూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కోలలపూడి, కోణంకి, బొల్లాపల్లి గ్రామాల్లో మార్టూరు సీఐ ఎస్.వి. రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలోనూ, సంతమాగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వెల్లల చెరువు, కామేపల్లి, పాతమాగులూరు గ్రామాల్లో సీఐ కె.నరసింహారావు, ఎస్ఐ పి.సురేష్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. భట్టిప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని వెల్లటూరు, భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామాల్లో ఎస్ఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేవిధంగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రజలు రాజ్యాంగం ద్వారా వారికి సంక్రమించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్వేచ్ఛాయుత ఓటింగ్‌కు సహకరించండి

భట్టిప్రోలు: సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని ప్రజలకు భద్రత కల్పించేందుకు కేంద్ర సాయుధ బలగాలతో కలసి శనివారం పోలీసు కవాతు నిర్వహించారు. భట్టిప్రోలు, అద్దేపల్లి, వెల్లటూరు పురవీధులలో పోలీసులు సాయుధ బలగాలతో కవాతు నిర్వహించి ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశానుసారం ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. పోలీసులు భద్రత కల్పిస్తారనే ఆలోచన ప్రజల్లో కల్పించే ఉద్దేశ్యంతో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. అందరూ ఎన్నికల నియమావళిని పాటిస్తూ ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దని సూచించారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించి గొడవలు సృష్టించాలని చూస్తే వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

శాంతియుత మార్గంలో జీవనం కొనసాగించండి

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

రేపల్లె రూరల్: ఖైదీలు శాంతియుత మార్గాన్ని ఎంచుకొని సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు సూచించారు. పట్టణంలోని సబ్‌జైలులో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రిమాండ్ ఖైదీలకు శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పిదాలకు తమతో పాటు తమ కుటుంబ సభ్యులను సైతం ఇబ్బందుల పాలు చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దీంతో జీవిత కాలం బాధలు పడాల్సిన పరిస్థితులు వస్తాయన్నారు. ఇక నుంచైనా పగలు ప్రతీకారాలను వీడి శాంతి కాముకులుగా జీవించాలని సూచించారు. అనంతరం జైలులో ఖైదీలకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. వివిధ రకాల చట్టాలను వివరించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఎల్.జగదీష్‌కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బీ.రూపశ్రీ,, సబ్‌జైలు సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు తదిరులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలకు ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో చిన్నారులను పరీక్షిస్తున్న వైద్యులు

వేమూరు: దివ్యాంగ బాలలకు ప్రభుత్వం ఉచితంగా ఉపకరణాలు అందజేయడం జరుగుతుందని బాపట్ల జిల్లా సహిత విద్య సమన్వయకర్త మాట్లా జ్యోత్స్న తెలిపారు. మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో శనివారం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని ఆమె తెలిపారు. వేమూరు మండలంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాలకు సంబంధించిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరానికి 150 మంది దివ్యాంగ బాలలకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అడియాలజిస్టు ఎస్ నివేదిత, అప్టోమెట్రిస్ట్ జి.లాస్యయాదవ్, సైకాలజిస్టు టి.నాగ కోటేశ్వరరావు, ఫిజియో థెరపిస్టు శ్రీధర్, శరత్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనిధి వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఆమె తెలిపారు. త్వరలో ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉచితంగా ఉపకరణాల పరికరాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఐ వెంకటేశ్వరరావు, రోజ్‌ల్యాండ్ ప్రధానోపాధ్యాయులు మూర్తి, భవిత కేంద్రం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈస్టర్ వేడుకలకు సన్నాహాలు



విద్యుత్ దీపాలంకరణలో పల్లెకోన చర్చి

భట్టిప్రోలు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈస్టర్ పండుగను జరుపుకునేందుకు క్రైస్తవ సోదరులు శనివారం తమ పూర్వీకుల సమాధులను పరిశుభ్రం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఆదివారం సమాధుల వద్ద పునరుత్థాన ప్రార్థనలు చేయనున్నారు. వేకువ జామునే స్మశాన వాటికలలో తమ పూర్వీకుల సమాధుల వద్ద పూలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఏసుక్రీస్తు మరణించి పునర్జీవిగా తిరిగి రానున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈస్టర్ పడుగను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుంది.

వేమూరు: ఆదివారం ఈస్టర్ పండుగను పురస్కరించుకొని క్రైస్తవులు సమాధులు శుభ్రం చేస్తున్నారు. గుడ్‌ఫ్రైడే రోజున ఏసుక్రీస్తును శిలువ వేశారు. ఈస్టరు పండుగ రోజున ఏసు ప్రభువు సమాధి నుంచి లేచి తిరిగి వస్తాడని క్రైస్తవుల నమ్మకం.

పాస్కా జాగరణ మహోత్సవాలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు క్రీస్తు రక్షకుని దేవాలయం (ఆర్‌సీఎం చర్చి), ఓలేరు పునీత శౌరీ దేవాలయంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు ఈస్టర్ వేడుకలలో భాగంగా పాస్కా జాగరణ మహోత్సవాలు నిర్వహించారు. విచారణ గురువులు రవికుమార్ రెడ్డి, సేవి పుదిచ్చేరుల ఆధ్వర్యంలో సహాయక గురువులు మార్టిన్, బిబిన్ బెన్నీలు ప్రార్థనలు నిర్వహించారు. భట్టిప్రోలు బేతేలు ప్రార్థనా మందిరంలో పాస్టర్ కె.అబ్రహం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

బీజేపీ,ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలను ఓడించాలి

భట్టిప్రోలు: దేశంలోని ప్రజలందరిపై ధరల భారం మోపిన బీజేపీ, ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలను ఓడించాలని సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య కోరారు. శనివారం భట్టిప్రోలు సీపీఎం మండల కమిటీ సమావేశం స్థానిక కార్యలయంలో జరిగింది. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దేశంలో ధనవంతులను పెంచింది కానీ పేదరికాన్ని తగ్గించలేకపోయిందని అన్నారు. ప్రజా వ్యతిరేక శక్తులకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఇండియా కూటమిని బలపరచాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు టి. కృష్ణమోహన్, మండల కమిటీ సభ్యులు ఎం.సత్యన్నారాయణ, రామస్వామి, జి.నాగరాజు, డి.సత్యన్నారాయణ, పి.మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాస్తవిక సమాజానికి నిలువుటద్దం 'గోపాత్రుడు'



తెనాలి: వాస్తవాలతో కాకుండా ఉద్వేగాలు, విశ్వాసాల ఆధారంగా సత్యాన్ని నిర్ధారిస్తున్న 'పోస్ట్ ట్రూత్'ను 'గోపాత్రుడు' నవలలో అధిక్షేపణ ప్రక్రియతో కేఎన్‌వై పతంజలి శక్తివంతంగా వివరించినట్టు ప్రముఖ సాహిత్య విమర్శకుడు జి.లక్ష్మీనరసయ్య అన్నారు. ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో స్థానిక సాహితీ, సాంస్కృతిక సంస్థ 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఇక్కడి కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో కేఎన్‌వై పతంజలి నవల 'గోపాత్రుడు'పై చర్చావేదికను నిర్వహించారు. న్యాయవాది జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. లక్ష్మీనరసయ్య తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ పోస్ట్ ట్రూత్ భావనను గోపాత్రుడు నవలలో ఎలా వర్ణించిందీ, ఆ నవలలోని ఘటనలు, సంభాషణలతో వివరించారు. ముఖ్యంగా నవలలో సత్యం అనేది వివిధ సమూహాల ప్రయోజనాల కనుగుణంగా ఎలా వండబడుతుందీ చెప్పటం జరిగిందన్నారు. కులాలు, మతాలు, భావజాలాలు, రాజకీయ పార్టీలు ఇలాంటి సమూహాలుగా చీలిపోయిన సమాజంలో ఎవరి సత్యం వారిదేగాని అందరికీ చెందిన సత్యం గ్రహణం బారిందన్న వాస్తవాన్ని పతంజలి చక్కగా వివరించినట్టు తెలిపారు. సత్యం అనేది సమాజగతంగా కాకుండా సంస్థాగతంగా, సమూహగతంగా, వ్యక్తిగతంగా లాభనష్టాల కనుగుణంగా మారిన తీరుతెన్నులను నవలలో చూడొచ్చని చెప్పారు. సమాజం నైతికంగా, అధ్యాత్మికంగా పతనమైన దానికి నిదర్శనంగా ఈ నవలను చూడాలనీ, గోపాత్రుడు నవల నేటి రాజకీయాల్లోనూ, వివిధ సమూహాల ఘర్షణల్లోనూ ఎలా బతికివుందో మనం చూడొచ్చని 'చినుకు' సంపాదకుడు నండూరి రాజగోపాల్ తన ప్రసంగంలో చెప్పారు. జుగాష్‌విలి పర్యవేక్షించారు.

మంతెనవారిపాలెంలో ఎన్నికల ప్రచారం

పిట్టలవానిపాలెం: బాపట్ల జిల్లా అభివృద్ధి కోన రఘుపతితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ నాయకులు, బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కోన రఘుపతి తనయుడు కోన నిఖిల్ అన్నారు. మండలంలోని మంతెనవారిపాలెం గ్రామంలో పార్టీ నాయకులు నర్రా శ్రీనివాసరావు, బోరుగడ్డ ఆదాంల ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బాపట్ల జిల్లాను సాధించడంతో పాటు వైద్య కళాశాలను సైతం బాపట్లలో ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతిని మూడోసారి ఆశీర్వదించాలని కోరారు. ఏప్రిల్ 19న ఎమ్మెల్యే అభ్యర్థిగా కోన రఘుపతి నామినేషన్‌ను దాఖలు చేయనున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి కోన రఘుపతిని గెలిపించాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు అహ్మద్ హుస్సేన్, మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఎనుముల కోటేశ్వరరావు, కుంతం ప్రసన్నరాజు, కొర్లపాటి రాజేష్, మండే విజయ్‌కుమార్, డి.కోటిరెడ్డి, బడుగు ప్రకాశరావు, బొలగాని సుబ్బారావు, సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.

దాతృత్వానికి ప్రతీక రంజాన్ పండగ

- వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు
- భట్టిప్రోలులో ఇఫ్తార్ విందులో అశోక్‌బాబు



ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందు ఆరగిస్తున్న వరికూటి అశోక్‌బాబు

భట్టిప్రోలు: క్రమశిక్షణ, దాతృత్వం, ఆధ్యాత్మిక చింతనలకు ప్రతీకగా ముస్లింలు రంజాన్ మాసాన్ని పవిత్ర మాసంగా భావించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు అన్నారు. శనివారం భట్టిప్రోలులోని షాదీఖానాలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముస్లింల పవిత్ర దివ్య ఖురాన్ ఏర్పడిన మాసంగా ముస్లింలు రంజాన్ మాసం అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారని తెలిపారు. కులమతాలకు అతీతంగా మానవులంతా ఒక్కటే అని బోధించే ఖురాన్ ప్రపంచ మానవాళికి దార్శనికమని అన్నారు. రంజాన్ మాసం నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేసి, రంజాన్ పర్వదినం రోజున విశేషంగా ప్రార్థనలు చేయడంతో పాటు తాము సంపాదించిన మొత్తంలో కొంత శాతాన్ని దాన ధర్మాలకు వినియోగించి దాతృత్వం చాటుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామమని చెప్పారు. తొలుత మసీదులలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు సిరాజుద్దీన్, అబ్దుల్ కరీమ్, తబ్రేజ్, అబ్దుల్లా బేగ్, సయ్యద్ కబీర్, నబీ, కుతుబుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యం

యడ్లపల్లి(వేమూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పించడం జరిగిందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు అన్నారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామంలో శని వారం రాత్రి పఠాన్ అబ్దుల్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంజాన్ మాసం అత్యంత పవిత్రమైందన్నారు. ముస్లింలు రంజాన్ పండగను అనందంగా జరుపు కోవాలని ఆకాంక్షించారు. ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మసీదు కమిటీ సభ్యులు అశోక్‌బాబును సత్కరించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. నేడు ఎంతో మంది ముస్లిం విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత ముస్లింలకు అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షేక్ ముంతాజీ, గొంతి శోభారాణి, గొల్లపూడి లక్ష్మి, ఆలపాటి సుబ్బయ్య, జోగయ్య, గొంతి వెంకట్రావు, పి సతీష్, సాయి, ఉప ఎంపీపీ ప్రసన్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే శివకుమార్

ఎంపికైన విద్యార్థులను అభినందించిన ఏఎస్ఎన్ విద్యా సంస్థల చైర్మన్ శివకుమార్

తెనాలి అర్బన్: క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లకు ఏఎస్ఎన్ విద్యా సంస్థలు రాష్ట్రంలోనే పేరు గాంచాయని తమ విద్యా సంస్థల్లో చదవిన ప్రతి విద్యార్థి చదువు పూర్తయ్యే లోపు ఉద్యోగాన్ని సాధించడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నామని విద్యా సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. ప్రకాశం రోడ్డులోని అన్నాబత్తుని సత్యనారాయణ డిగ్రీ కళాశాలో శనివారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగాలు సాధించిన 32 మంది విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రముఖ ఫైనాన్స్ సంస్థ పిరమాల్ ఫైనాన్స్ లిమిటెడ్ తమ కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించిందని చెప్పారు. దీనిలో 32 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు వివరించారు. వీరికి నెలకు రూ.21 వేల వేతనం లభిస్తుందన్నారు. అలాగే బీకాం చివరి సంవత్సరం చదువుతున్న దినేష్ సత్యసాయి ఐటీసీ కంపెనీలో అత్యధిక వేతనంతో కూడిన ఉద్యోగాన్ని సాధించినట్లు చెప్పారు. రూ.4.4 లక్షల వార్షిక వేతనం అతనికి లభిస్తుందన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామ్‌చంద్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం కొనసాగుతున్న నేపథ్యంలో తమ విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన శిక్షణను తమ కళాశాలలో అందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

భారతీయ సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శం

వివేకానంద సెంట్రల్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డేలో విద్యావేత్త డాక్టర్ ఏ. ఆంజనేయులు




గ్రాడ్యుయేషన్ డేలో సర్టిఫికెట్లు స్వీకరించిన చిన్నారులు

తెనాలి: భారతదేశంలోని కుటుంబ వ్యవస్థ, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ఏ.ఆంజనేయులు అభిప్రాయపడ్డారు. భారతీయ సంస్కృతిని పాశ్చాత్య దేశాల శాస్త్ర సాంకేతికతతో మేళవించి విద్యార్థులు కృషి చేసినట్టయితే అద్భుత విజయాలు సాధించగలరని పిలుపునిచ్చారు. స్థానిక శ్రీ వివేకానంద సెంట్రల్ ఆవరణలోని ఏవీఎస్ ఆడిటోరియంలో శనివారం గ్రాడ్యుయేషన్ డేను వైభవంగా నిర్వహించారు. ఒకటో తరగతి నుంచి 11వ తరగతి వరకు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాన్వొకేషన్ తరహాలో విద్యార్థులకు వేర్వేరుగా ప్రత్యేక దుస్తులు ధరింపజేసి ఒక్కో తరగతి విద్యార్థులను ప్రత్యేకంగా అలంకరించిన వేదికపైకి ఆహ్వానించి అతిథులచే సర్టిఫికేట్లు, క్రీడల్లో విజేతలకు పతకాలను అందజేశారు. తెనాలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సివిల్ సర్జన్, రెయిన్‌బో ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ జీవనలత, ప్రముఖ దంత వైద్యుడు, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ డి.రవీంద్రనాథ్, వివేక విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు విద్యార్థులకు సందేశాలనిచ్చారు. సాయంత్రం వరకు జరిగిన వేడుకలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వివేకానంద సెంట్రల్ స్కూల్ సీఈవో రావిపాటి వెంకట్రామ్, ప్రిన్సిపాల్ రమాదేవి, శివకుమార్, జీవీ చౌదరి, మురళి, రాజేష్, అక్షయ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

కేంద్రీయ విద్యాలయ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి అర్బన్: తెనాలి జగ్గడిగుంటపాలెంలోని కేంద్రియ విద్యాలయంలో బాలివాటిక–3, ఒకటో తరగతి ప్రవేశాలకు కేంద్రియ విద్యాలయ సంఘటన్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రిన్సిపల్ సురేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి 15 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెండో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను సైతం భర్తీ చేయడం జరుగుతుందన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాలు వచ్చిన తరువాత నుంచి 10 రోజుల లోపు 11వ తరగతికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 19న ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. వివరాలకు కేంద్రియ విద్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్

తెనాలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ స్థాయి పీడబ్ల్యూడీ (దివ్యాంగులు) కమిటీ సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్, తెనాలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రఖర్‌జైన్ సమావేశానికి అధ్యక్షత వహించారు. మరికొద్ది రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగులైన ఓటర్లకు పోలింగ్ కేంద్రాల వద్ద సమకూర్చాల్సిన ప్రత్యేక సదుపాయాలపై ప్రతినిధులతో చర్చించారు. ఇంటి వద్దే ఓటింగ్‌కు అవకాశం, దివ్యాంగ ఓటర్ల ఓటింగ్ శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చలు జరిపారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం, ఇతర సంక్షేమ సంఘాల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశమయ్యారు. తెనాలి తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, సంక్షేమ శాఖ అధికారులు, విద్యాశాఖాధికారులు, వికలాంగుల సంక్షేమ సంఘ ప్రతినిధులు గుంటుపల్లి ఉదయ్‌కిరణ్, బాలసుబ్రహ్మణ్యం, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ పాల్గొన్నారు.